వెలుగు చీకట్లు

కుమారి శిరిపురపు విజయ

"ఎంతదూర మీ పయనం
అంతులేని యీ గమనం"

మనం ఏదయినా ప్రయాణం చెయ్యదలచుకొంటే దానికంతు మనకు తెలుస్తుంది. మన మెక్కడకు వెళ్లాలో ముందనుకునే బయలుదేరతాం. కానీ ప్రపంచంలో ఒక రకం మనుష్యులున్నారు చూశారూ? వారి ప్రయాణానికి దూరమూ తెలియదు. వారి గమనానికంతూ తెలియదు.

ఆ కోవలోకి చెందినవాడే శర్మ. శర్మ చిన్నతనంలో చాలా తొందరమనిషి. రోజులు దొర్లుతున్న కొద్దీ ప్రపంచాన్ని అర్థంచేసుకోగలుతున్నాడు. శర్మకి తండ్రిలేడు. ఒక చెల్లాయిమాత్రంవుంది. తల్లి కాంతమ్మగారికి ఎప్పుడూ ఏదో అనారోగ్యమే. శర్మ తండ్రి బ్రతికివుండగానే బి. ఏ. పూర్తిచేశాడు. అదికాక తండ్రి పరమపదించగానే చదువుకి తిలోదకా లొదిలాడు. అదికాక యింకా చేసేదిమాత్రమేముందిలెండి? పోనీ వెనక ఎవరైనా సంసారం చూసిపెడతారంటే ఎవరూలేరు. లేక వెనక ఆస్తేమయినావున్నదా అంటే అది అంతకంటేలేదు. రెక్కలాడితేనే డొక్కలాడతాయి అనే దగ్గరుంది వారి సంసారం. చెల్లెలు ఇంటరు చదువుతుండగా తండ్రిపోతే ఆమెకూడా చదువుకు స్వస్తివాచకం పలికింది. శర్మ కష్టపడి తొందరలోనే ఏదో ఆఫీసులో వుద్యోగం సంపాదించుకోగలిగాడు. ఆ వచ్చే నూటయిరవై రూపాయలతో ఎలాగో సంసారాన్ని గడపగలననే ధైర్యం అతన్నందుకు పురికొల్పింది.

ఇందిర చాలా అందంగా వుంటుంది. శర్మ ఒక మాదిరిగా వుంటాడు. ఇందిరంటే శర్మకెంతో ప్రేమ. ఆమె రూపం ఒక్క నిమిషంకూడా తనకి కనిపించకపోతే సహించలేకపోయేవాడు. అతను వుదయం నిద్రలేవగానే ఇందిర ముఖంచూసే మంచందిగేవాడు. తల్లి కాంతమ్మగారెప్పుడైనా "ఇందిర అత్తవారింటికి వెళ్లాక ఎవరిముఖం చూస్తావురా బాబూ" అంటే ఇందిర జవాబిచ్చేది "సుందరి ముఖం" అని. అది వినగానే శర్మ అటుతిరిగి పడుకునేవాడు.

సుందరి శర్మకి మేనమామ కూతురు. ఫోర్తుఫారంవరకూ చదివింది. ఆ అమ్మాయి పుట్టినప్పటినుండి శర్మ భార్యేనని ఊరూ నాడూ ఏకమయి ఏకకంఠంతో పలికింది. పలకడమేమిటిలెండి. భార్యే అయిపోయినట్లే భావించింది. సుందరికి తల్లీ తండ్రీ వున్నారు. శర్మ తండ్రి చనిపోయినప్పుడు వారంతా వచ్చి పరామర్శించి వెళ్లారు. శర్మకి వుద్యోగం దొరికాక పెండ్లి విషయం కదిలించికూడా చూశారు. రెండు ప్రక్కలా సుముఖులుగా నుండడంవల్ల పెండ్లికూడా ఏ అవాంతరాలూ లేకుండా అయిపోయింది. సుందరి కొక తమ్ముడుకూడా వున్నాడు. పిల్లలిద్దరే అవడంవల్ల పెండ్లవగానే సుందరికి ఆస్తిలో సగం భాగం యిచ్చారామె తండ్రి. సుందరి కాపరానికి రాగానే ఆ యిల్లంతా కలకల్లాడడం మొదలు పెట్టింది. సుందరి, ఇందిర లిద్దరూ సమవయస్కులూ, మేనత్త మేనమామ బిడ్డలూ అవడంవల్ల తొందరలోనే ఒకరినొకరర్థంచేసుకోగలిగారు. ఆమె వచ్చాక మళ్లా యిందిరను కాలేజీలోచేరమని ప్రోత్స

హించింది. తల్లి పెండ్లిమాటెత్తినప్పుడు అన్నా వదిన లిద్దరూ ఆ విషయం ఇందిరకే వదలివేశారు. ఆమె యింకా చదువుకుంటా నంటోంది. చదువు పూర్తయ్యాకా ఆమే తనకు సరియైన వరుని ఎన్నుకుంటుందని వారి యభిప్రాయం. ఈ కాలంలో చదువుకొనే ఆడపిల్లల తలిదండ్రులు కొందరైనా ఈ యభిప్రాయాన్నికలి వున్నారనడంలో నేనంత పొరపాటుపడడం లేదనుకుంటాను.

అనుకున్నట్లుగానే ఇందిర ఇంటరు పూర్తిచేసి బి. యస్. సిలో చేరింది. ఆమెకి చదువంటే శ్రద్ధ వుంది. దానికి తగినట్లు మంచి తెలివితేటలుకూడా వున్నాయి. ఈ రెండూ ఒకచోట మిళితమైనప్పుడు పైకిరావడంలో సందేహమేముంది.

ఇందిర బి. యస్. సి మొదటి సం॥లో వున్నప్పుడు ఆ సంవత్సరం వార్షికోత్సవం జరిగింది. ఫంక్షన్సుకి వెళ్లడమంటే, ఆమెకు చాలా సరదా. సినిమాలంటే పిచ్చికూడా యెక్కువే. ఆరోజు కొన్ని నాటకాలుకూడా జరిగాయి. ఒక ప్రోగ్రామ్‌కి ఇంకోదానికి మధ్య వ్యవధిలో కొన్ని మధుర గాత్రాలు అక్కడున్న కాంతల సుశ్రూతలూగించాయి.! పురుషులను మైమరపింపజేశాయి. వృద్ధులు వహ్వా అని బుర్రలూగించారు. బాలురు చప్పట్లు చరచి ఎగిరి గంతులువేశారు. ఒక గాత్రాన్నిమాత్ర మెవరు మరచిపోలేకపోయారు. ఆ పాటాగిపోగానే 'ఒన్సుమోర్' అని రిక్వెస్టులు వెళ్లాయి. ఆ గాత్రం మరల తీయగా సాగింది. అబ్బా! అతనికా కంఠం భగవంతుడెలా యిచ్చాడు? అందరికీ అలాటి కంఠం లేదే. ఆ టాలెంట్ భగవంతుడు ఒక్కొక్కళ్లకిస్తాడు. అందరికీ ఇవ్వడే. ఆ భగవంతునికంత వలపత్యందేనికి? అనే ప్రశ్నలే అందరిలోనూ ఆ క్షణంలో మొలకెత్తాయి. అందరినీ యంతమైమరపించినగానం స్వతహాగా పాటలంటే చెవికోసుకునే ఇందిరకి మాత్రం సంతోషదాయకంకాదా? అందరికంటే ఆమె మరో రెండు మెట్లుపైనేవుంది. పాట పాడినవ్యక్తి కర్టెనుకు వెనుకనుండే పాడడం జరిగింది.

పాట రెండోసారికూడా పాడాక అతనిపేరు మైక్‌లో చెప్పారు. "సుధాకర్ బి. యస్. సి. మూడవ సంవత్సరము" అని. "సుధాకర్? థర్డ్ ఇయర్?" అని అప్రయత్నంగా రెండు మాటలు ఇందిర పెదవులనుండి పైకివెలువడ్డాయి. బహుశ! ఆ మాట లితరులు వినేంత గట్టిగా అని వుండదు. ఆమెకు సుధాకర్ పేరు విన్నగుర్తువున్నదికాని మనిషెవరో ఎంత ప్రయత్నించినా జ్ఞాపకం చేసుకోలేకపోతోంది. పైగా తన క్లాస్‌మేటు మరునాడెలాగయినా ఆ అబ్బాయిని చూడాలనుకుంది. అంత చక్కగా పాటపాడిన అబ్బాయి ఎలా వుంటాడో చూడాలనామె మనస్సువ్విళ్లూరిపోతోంది. మరునాడు క్లాసులో ఆటెండెన్సు పిలచేటప్పుడు ఎంతో జాగ్రత్తగా వినసాగింది. ఆడపిల్లలు మొదటివరసలో కూర్చొని వుండడంవల్ల మనుష్యుల ముఖాలు చూడడానికి వీలులేకుండావుంది. చివరికామె కాత్రుత మరీ ఎక్కువయింది. ఆమె హృదయమామెకు తెలియకుండా తొందర తొందరగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. చివరికొచ్చిందా నామధేయం.

"సుధాకర్"

"యస్ సార్" - తీయని కంఠం జవాబిచ్చింది. ఆమె వెంటనే వెనుతిరిగి చూడాలనుకుంది. కాని ఆమెకెందుకో భయంవేసింది. అలా చెయ్యలేక అవకాశం జారవిడుచుకుంది. ఆ సాయంత్రం క్లాసులు అయ్యాక రోజులాగే ఇందిర లీలలు కలిసి నడిచే యింటికి వెళ్తున్నారు. అప్పుడే కాలేజీ విడిచి పెట్టడంవల్ల విద్యార్థులంతా గుంపులు గుంపులుగా వెళ్తున్నారు. ఒక ప్రక్కనుండి లీలా ఇందిరలుకూడా తలలు వంచుకుని నడిచిపోతున్నారు. ఒకసారి అప్రయత్నంగా లీల తలెత్తి చూచింది. ముందెవరో అబ్బాయి ఒక్కడే నడిచిపోతున్నాడు. లీల కొంచెం తొందరగా నడిచి ఆ అబ్బాయిని "బాజీ" అని ఉద్దేశించి పలికింది. ఆ అబ్బాయి వెంటనే ఆగి లీలవైపుచూచి చిరునవ్వునవ్వాడు. "ఏం లీలా! ఈ మధ్యన కనిపించడం మాని

వేళావే!" అని పల్కరించాడు. "ఇంట్లో అంతా కులాసాగానే వున్నారని తెలుసుకుని తర్వాత కనుపిస్తాలే అని చెప్పి లీల తిరిగి ఇందిర దగ్గరకొచ్చింది. అతను వెళ్ళిపోయాడు. లీల చెప్పింది తను తన చిన్నాన్నగారి అబ్బాయని వాళ్ళక్లాసే చదువుతున్నాడనీ.

"బాజీ అనే పేరునే సెప్పుడూ వినలేదే" అంటుంది ఇందిర.

"బాజీయా! బాజీ ముద్దుపేరు. అతని అసలు పేరు సుధాకర్. పాటలు బాగాపాడతాడు. మొన్న "కాలేజిడే"కికూడా పాడాడు" అని ఏమేమో చెప్పుకుపోతోంది. కాని సుధాకర్ అని వినగానే ఇందిర ముఖ కవళికలు మారాయి. "అరె! ఆ అబ్బాయిని సరిగ్గా! చూడలేదే. అతనే సుధాకర్ అని తెలిస్తే ఇంకోసారిచూసేదాన్నే!" అనుకొన్నది. ఇందిర ఏదో ఆలోచిస్తోందని కనిపెట్టి లీల "ఏమిటిందిరా. ఏమిటాలోచిస్తున్నావు?" అని పల్కరించింది.

"అహా ; ఏమీలేదు. సుధాకర్ నీ కన్నయ్యా? నువ్వెంత అదృష్టవంతురాలవు" అని అనుకొంటున్నాను

"ఏం! పాటలు పాడడం వచ్చినందువల్లనే అతనంత గొప్పవాడా యేమిటి?" అన్నది లీల. అందుకిందిర "ఎవరికయినా అభిరుచి వుండి వాటి విలువ తెలిస్తేనే కదా అభినందించ కలిగేది" అనుకుంది.

లీల యింటికి వెళ్తూ ఆదివారంనాడు ఇందిరని వాళ్ళయింటికి ఆహ్వానించింది. ఇందిర కూడా దగ్గరలోవున్న వాళ్లయింటికి వెళ్ళిపోతుంది. ఆ రాత్రి భోజనం చేసి అన్నతో కొంతసేపు మాట్లాడాక చదువు ఉపక్రమించింది. కాని ఒక్కపేజీ తిరగడంలేదు. మధ్యలో సుందరి ఎందుకో ఆగదిలోకి వస్తుంది. ఇందిరేదో పరధ్యానంగా ఆలోచిస్తూవుండడంవల్లా మారాకను గమనించదు. సుందరి పలుకరించేసరికి ఉలిక్కిపడిచూస్తుంది. వెంటనే మన ప్రపంచంలోకి "వచ్చి ఏమిటివదినా" అని పల్కరిస్తుంది.

"ఏమిటిందిరా! ఎవరిగురించి నీ ఆలోచనలు. కొంపదీసి ఎవరయినా అబ్బాయి నీ హృదయంలో దూరాడా ఏమిటి తెలియకుండా! అంత తంటాలు పడుతున్నావు" అంటుంది చిలిపిగా.

ఇందిరకూడా "ఛీ! ఏమిటమ్మా అలాటిమాటలు" అని నవ్వుతుంది.

మరునాడు మధ్యాహ్నం ఇంటర్వల్‌లో లీలా ఇందిరలు వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని వుండగా బాజీవచ్చి పిలుస్తాడులీలని. సుధా వాళ్లమ్మగారేదో కబురు పంపడంవల్ల అది చెప్పడానికొస్తాడు సుధా. లీల ఇందిరని పిలుస్తుంది బయటికి. ఇందిర నాడి చాలా జాస్తి అవుతుంది అడుగులో అడుగు వేసుకుంటూ వస్తుంది బయటికి. లీల "బాజీ! ఈ అమ్మాయి ఎవరో తెలుసా? మనక్లాస్‌మేటు. ఇందిర" అని పరిచయంచేస్తుంది. సుధాకర్ విశాల నేత్రాల ప్రశాంతమైన చూపులు ఇందిర మీదకు ప్రసరిస్తాయి. ఇందిరకు నమస్కారంచేస్తాడు. ఇందిరకూడా ప్రతినమస్కారంచేసి అతని ముఖం వైపు చూసి వెంటనే తనదృక్కులు లీలవైపుకు తిప్పుకుంటుంది. ఆమెకా క్షణంలో ఏవో చెప్పరాని భావాలు హృదయంలో ఉప్పొంగుతాయి. తనెన్ని రోజులనుండో చూడాలనుకున్న మధురగాయకుడు తనకెదురుగా నిలబడినా ఆమె అతని ముఖం చూడడానికైనా ధైర్యం చాలకపోయింది. అతనుకూడా ఆమె పరిస్థితిని గమనించి అతనే మాట్లాడాడు.

"మిస్ ఇందిర! బాగా చదువుతున్నారనుకుంటాను. మీరు క్లాస్‌మేట్ అని తెలిసినా ఇంతవరకూ మాట్లాడే అవకాశం లేకపోయింది" అని.

"నాకుకూడా మిమ్మల్నింతవరకూ తెలియదండి, మొన్న కాలేజిడేనమాత్రం మీపాటలు విన్నాను"

అంటూంటే ఇందిరకళ్ళల్లో ఏదో ఒకవిధమైన మెరుపు చూడకలిగేదు సుధ.

"నా పాటలేమున్నాయిలెండి. స్వతహాగా కోకిలగాత్రులనే పేరుగల మీ నారీమణులు పాడ్తేనే పాటలకు అందంవుంటుంది. మాలాటివాళ్లుపాడితే పాటలో వున్న మాధుర్యంకూడా పోతుంది"

"అలా అని నేనెప్పుడూ అనుకోను. అలాటి టాలెంట్ ఏ ఒక్కరికో భగవంతుడిస్తాడు. అది లభ్యమయింది. అందుకే మీరెంతో అదృష్టవంతులంటాను నేను" అని చిరునవ్వు నవ్వుతుంది.

అతను ఇందిర మాట్లాడుతూంటే ఆమె కదిలే పెదవులని నవ్వినప్పుడా చక్కని పలువరసని మీగడతరకల వంటి ఆ బుగ్గలని బుగ్గపైనవ్వినప్పుడు పడే ఆ సొట్టనీ చూసేసరికి మనస్సేదోలా అయిపోతుంది ఇందిర చాలా అందంగా వుంటుందనామె కనుపించినపుడు అనుకొనేవాడు సుధ కాని అతని కంతవరకే వుద్దేశమూ రాలేదు. ఇప్పుడామెను చూస్తూంటే అతనిలో ఎందుకో మార్పు రావడం మొదలుపెట్టింది.

"సరే వస్తానండి. క్లాసుకు టైమువుతోంది" అని ఇందిరతో "చెప్పి వస్తాను లీలా" అంటూ లీలతో చెప్పి వెళ్లిపోతాడు.

ఆ ఆదివారం ఇందిర లీలావాళ్ల యింటికి వెళ్తుంది. ఇద్దరూ సినిమా ప్రోగ్రామ్‌కూడా వేసుకున్నారు. ఇద్దరూ సినిమాకు బయలుదేరే సమయానికే మరో స్నేహితుని యింటికి పోతూ సుధ పెదనాన్నగార్నికూడా చూసిపోదామని వీరింటికి వస్తాడు. ఇందిరా లీలలు ఎదురవడంవల్ల "ఎక్కడికి లీలా ప్రయాణం?" అని ప్రశ్నిస్తాడు లీల. సుధాకి సినిమాకి వెళ్లాలనేవుంది. కాని వచ్చి పెద్దమ్మగార్కి కూడా కన్పించకుండా వెళ్లిపోతే ఏమనుకుంటారోనని భయం. ఆవిడకి కన్పిస్తే ఆవిడ కింటి కబుర్లు చెప్పడంలో లీలా వాళ్ళకి టైము అయిపోతుంది. అందులో ఇందిరకూడ వుంది. ఆమెని మొదటిమారు చూడగానే మొలకెత్తిన ప్రేమాంకురం ఈసరికి బాగా నాటిమొక్కయింది. ఈ సదవకాశాన్ని జారవిడవనిచ్చగించడంలేదు మనస్సు. తొందరగా ఎలానో సమాధానం చెప్ప కలిగేను లీలకి "అమ్మతో మాట్లాడి వీలుంటే వస్తాలే లీలా మీరు వెళ్ళండి మీకు టైము అయిపోతుంది. నిరంజన్ టాకీస్‌కేగా!" అని అడుగుతాడు.

"అక్కడే-ఓకే! వేంపోతాం" అంటూ లీలా ఇందిరలు అక్కడనుండి సినిమాకి వెళ్ళిపోతారు.

సుధ లీలావాళ్ళ అమ్మగారితో యేవో రెండు మాటలు మాట్లాడి మళ్లా వస్తానంటూ తన స్నేహితుని గొడవే మరచిపోయి తిన్నగా నిరంజన్ టాకీస్ వైపు త్రోవతీస్తాడు. సుధ వెళ్లేసరికి సినిమా మొదలుపెడతారు. తలుపులువేసేశారు. అంతా చీకటిగావుంది. నెమ్మదిగా టార్చి సహాయంతో లీలా ఇందిరలున్న చోటతెలుసుకుని లీల ప్రక్కన కూర్చుంటాడు. అది ఇంగ్లీషు సినిమా. ఆ సినిమాలో అక్కడక్కడ ప్రణయ దృశ్యాలు వచ్చేసమయానికి ఇందిరకేవో భావాలువచ్చి తెరవైపు చూడడానికి సిగువేసి ఒకసారి లీలపరిస్థితెలావుందోనని ఆమెవైపు చూసింది. లీలమాత్రం సినిమా చూడడంలోనిమగ్నురాలయింది. అదే సమయానికి బహుశః సుధకి కూడా ఆ ఊహే వచ్చివుండవచ్చు. అతనిప్రక్కకు చూడగానే ఆ చీకట్లో నాలుగుకళ్లూ కలుస్తాయి. కాని మరుక్షణమే విడిపోయాయి కూడా, అంతలోకి ఇంటర్వెల్ అవడంవల్ల తలుపులు తెరిచారు. లీల "ఏం! ఇందూ, సినిమా ఎలావుంది?" అని అడుగుతుంది. ఇందిర వెంటనే సమాధానం చెప్పలేక తడబడుతుంది అసలు సినిమా చూస్తేగా ఎలావుందో తెలియడానికి?

"ఏంబాజీ! సినిమా ఎలావుంది"

"పిక్చరా! ఇంకా పూర్తికాలేదుగా ఇప్పటివరకూ ఫరవాలేదు" అని తప్పించుకుంటాడు.

మగవాళ్లకి పెట్టింది పేరు. తమలో యేదయినా పొరపాటువున్నా లేనట్లే ప్రవర్తించి పైగా ఏమీ ఎరగని ఆడవాళ్ళమీద రుద్దుతారు కొందరు ధీమంతులు. అందరూ అలావుంటారని నేననడం లేదు సుమా! ఆ కేటగిరీలోకి చెందినవారి సంగతే నేననడం. అయితే ఆడవాళ్ళల్లో లేరా అలాంటివారు? అని మీరడుగుతారేమో! ఆడవాళ్ళల్లోనూ వుంటే వుండొచ్చు. కాని ఈ విషయంలో మాత్రం ఆడవాళ్ళకి పై చెయ్యే పురుషులు. ఇలాంటి ధీమంతులెంత మందో ఈ విశాల ప్రపంచంలో-ముఖ్యంగా విద్యార్థి ప్రపంచంలో. ఆతర్వాత కాలేజిలో లీలకోరకు సుధ వచ్చినప్పుడల్లా ఇందిరతో మాట్లాడకుండా వెళ్ళేవాడు కాదు. వారిస్నేహం రానురాను వృద్ధిపొందింది. వారిరూపాలు హృదయాల్లో చిత్రించుకున్నారు. ఆ చిత్రాలసన్నిధిలో ప్రేమజ్యోతిని వెలిగించుకున్నారు. ఇలా కొంతకాలం జరిగాక సుధ అడుగుతాడు ఇందిరని పెండ్లి విషయం. ఒక్క విషయం మరచాను చెప్పటం ఇందిర, సుధలు వేరు కులాలవాళ్లు. కాని వాళ్లిద్దరికీ కులమత విచక్షణలు లేవు. అందుకే వారొకరికొకరంత సన్నిహితులు కాగలిగారు. ఇందిర అన్నతో చెబుతానీవిషయమంటుంది. మరునాడింట్లో సుందరి దగ్గర వసుంధీ ప్రసక్తి. సుందరి అంటుంది "ఇందూ! నీకు నచ్చినవాణ్ణి నీవు తెచ్చుకోవడం మాకిష్టమే. మాకు భారం కూడా తగ్గుతుంది. కాని కానికులం అబ్బాయిని వెదుక్కుంటావని నేను కలలోకూడా అనుకోలేదు" అంటుంది. ఆమె శర్మతో చెబుతుంది. శర్మకూడా ఆ మాటే అంటాడు. మిగతా విషయాలన్నీ వారికి నచ్చాయి కాని కులంవేరయినందుకే వారందుకు సమ్మతించలేకపోతారు. ఇందిర ముఖం ముకుళించుకుంటుంది. ఆమెలో ఉత్సాహమే చచ్చిపోతుంది. చదవడానికి మనస్సొప్పడంలేదు. ఈ విషయం సుధకి చెప్పడానికిష్టంలేక రోజూ తప్పించుకుని తిరుగుతూవుంటుంది. ఆమె రాత్రుళ్లు చదవకుండా పుస్తకం తెరిచి సుధ జ్ఞాపకంరాగా కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూవుంటుంది. సహజంగా మెత్తని హృదయంగల సుందరి ఇది సహించలేకపోతుంది. వారి తల్లీ యీమధ్యనే యేదో హృదయరోగంతో హఠాత్తుగామరణించడంవల్ల ఇప్పుడు వారికామెయనుమతి తీసుకునే పనిలేదు. శర్మ కూడా ఇందిర పరిస్థితికనిపెడ్తూనేవున్నాడు. అతనత్యంత ప్రేమతో చూచుకునే ప్రియాతి ప్రియమైన ఒక్కగానొక్క చెల్లాయిలా బాధపడుతూంటే ఏ అన్నమాత్రం సహించి వూరుకోగలడు చెప్పండి! ఆమె జీవితాంతం తనకిష్టంలేని వాడితో ముళ్ళబాటలో విహరిస్తూంటే ఆ అన్నకళ్ళనుండి రక్తధారలు ప్రవహించక ఆనందభాష్పాలు రాలతాయా చెప్పండి! చివరికి శర్మ చెల్లాయికి చెబుతాడు సుధాకర్‌కామె నివ్వడానికి వారి కభ్యంతరంలేదని. ఇది వినగానే ఆమె యానందానికి మేరలేదు సుమా; ఆమె చిరునవ్వు ముఖంచూశాక శర్మకి కూడా హృదయంలో నిర్మల స్రవంతులు జలజలలాడాయి.

ఆ మరునాడామె సంతోషంగా కాలేజీకి వెళ్తుంది. సుధకోరకు వెదుకుతుంది. లీలనడుగుతుంది. ఈ మధ్య ఇందిర నాలుగయిదు రోజులు కాలేజికి వెళ్ళకపోవడంవల్లామెకు చాలా విషయాలు తెలియలేదు. బాజీ లీలకు సామాన్యంగా అన్ని విషయాలూ చెబుతాడు. ఇందిరతో వివాహప్రస్తావన తెచ్చిన రోజునే వాళ్ల నాన్నగారికికూడా వుత్తరం రాస్తాడు తనకిలా ఇందిరతో పరిచయం అయిందనీ ఆమెనితప్ప యింకెవ్వరినీ పెండ్లిచేసుకోవడం ఇష్టం లేదని. ఆ వుత్తరం వ్రాసిన మూడవ రోజున సుధకి టెలిగ్రామ్ వస్తుంది ఒకసారి రమ్మని. సుధకి ఇందిరని కలుసుకునే అవకాశం లేకపోతుంది. ఇందిర పేర ఒక వుత్తరంవ్రాసి లీలకిచ్చి లీలకన్ని విషయాలూ చెప్పి త్వరలోనే వస్తానని యింటికి వెడతాడు. ఇందిరకీ విషయాలన్నీ తెలియగానే మళ్ళా హృదయం బరువెక్కుతుంది. సుధ తల్లిదండ్రులు దీనికి సమ్మతిస్తారో లేదో! ఒకవేళ సమ్మతించ

రేమో! అనే పిచ్చి పిచ్చి ఊహలామెను మరింత పిచ్చిదాన్ని చేసేలా వున్నాయి.

అక్కడ సుధ యిల్లు జేరతాడు. సుధని చూడగానే తండ్రి కొంతసేపటివరకు మాట్లాడక ఆ తర్వాత నెమ్మదిగా చివాట్లు పెడతాడు. తల్లి కూడా చెబుతుంది బాబూ! ఇలాటి పనులుచేసి కుటుంబానికి మచ్చతీసుకురావద్దని. అతనిలాచేస్తే అతనికున్న మిగతాయిద్దరి చెల్లెళ్ల పెళ్ళిళ్ళు ఎలా కాను! సంఘంలో గౌరవం మంటకలిసిపోతుంది. సుధ తండ్రిగారి పేరుప్రఖ్యాతలు మట్టిపాలవుతాయి. ఈ విషయాలన్నీ రెండు రోజులు తలిదండ్రు లిద్దరూ విశదంగా బోధపరుస్తారు. ఆ విషయాలన్నీ సుధకి తెలియనివి కావు. తెలిసీకూడా అలా చెయ్యడమేమిటని మీరు ప్రశ్నిస్తారేమో! దానికి జవాబు చాలా వరకు వయస్సునుబట్టి వుంటుంది. ప్రపంచంలో వున్నది ఒక్క పేరు ప్రఖ్యాతలు మాత్రమే కావు. లేక కులమతాలే మానవులకు ప్రాణాలుపోసి జీవితాలని నడపడంలేదు. ప్రతి మానవుడికి వీటన్నిటికన్నా ముందు హృదయమనేది ఒక్కటుంది. హృదయానికి కావలసినవి ఇవన్నీ కావు. హృదయంవున్న ప్రతిమనిషీ నీతిగా బ్రతికే ప్రతిమనిషీ లోకాన్ని కూడా బాగానే అర్థంచేసుకోగలుతాడు. హృదయమే హృదయాల నర్థంచేసుకోగలదు కాని పాషాణాలు కావుసుమా!

సుధ జీవితానికిదొక పెద్ద సమస్య. దీనిని విశదీసుకోగలిగితే అతని జీవితం సుఖమయమవుతుంది. లేకపోతే బాధలతో కుమిలిపోయేకంటే వేరు గత్యంతరమేలేదు. సుధ తలిదండ్రులకి ఇలాటివాటిల్లో బాగా పట్టుదలవుంది. సుధకి క్షణాలు యుగాల్లాగా గడుస్తున్నాయి. క్షణక్షణానికి ఎక్కువయ్యే బాధని భరించలేకపోతున్నాడు. తన దుస్తులమీద, భోజనంమీద శ్రద్ధతీసుకోవడంలేదు. ఏదోలా ఎప్పుడూ తన గదిలోనే కూర్చుని తలపట్టుకుని ఆలోచిస్తూనే వుంటాడు. సుధ తల్లిగార్కి ఆవతారం చూసేసరి కెక్కడలేని కోపనూ వస్తుంది. రెండు రోజులు కోప్పడుతుంది. సుధ చలించలేదు. సుధ తనకన్న కొడుకు - సుధ ఒక్కడే కుమారుడు. సుధ తర్వాత యిద్దరూ ఆడపిల్లలే. సుధయే వారి కుటుంబానికి దీపం. అతనే వారి కుటుంబంపేరు నిలిపే పుత్రుడు. అలాంటి సుధాకర్ భోజనం మానుకుంటే కన్న తల్లి హృదయం కొట్టుకులాడింది. ఆమె రెండు రోజు లెలాగో సహించగలిగింది. కాని నవ మాసాలుమోసి కనిపెంచిన పుత్రుడు - భోజన మయినా చెయ్యకపోతే ఆమె హృదయం తరుక్కుపోదూ? వచ్చి బ్రతిమాలింది. కాని సుధ ఏమీ వినిపించుకోలేదు. మూడు నాల్గు రోజుల్లో చిక్కి శల్యమైపోయాడు. ఆ ఆకారాన్ని చూసి యీమె కంగారుపడింది. చివరికొక రోజున సుధాకర్ ఏదో నిశ్చయానికి వచ్చినట్టున్నాడు. తిన్నగా తండ్రి దగ్గరకువెళ్ళి యిలా చెబుతాడు.

“నాన్నగారూ! ఇక నేనిక్కడుండలేను. ఎక్కడికయినా వెళ్ళిపోతాను. నా హృదయాన్నర్థం చేసుకోనిదే యింట్లో వుండడంకంటే ఏమయిపోయినా మెరుగే”

“సుధా! ఏమిటి మాట్లాడుతున్నావో తెలుసా? నీవు ఏమయినా సరే, నా కుటుంబానికి మాత్రం మచ్చ తెచ్చుకోవడం నాకిష్టంలేదు. పో. నీ యిష్టం. ఎక్కడికయినా పో. నాకు వున్నది యిద్దరూ ఆడపిల్లలే ననుకుంటాను” అని వుద్రేకంగా అనేసారు. ఈ గలభాకి సుధ అమ్మగారు కూడా వస్తారక్కడికి. సుధ రూపు చూస్తూంటేనే ఆమెకు గుండె దేవినట్లవుతోంది. ఆమె యీ సంభాషణ వినగానే కన్నీరు కార్చడం మొదలు పెట్టింది. “సుధా! నా మాట వినవు నాయనా? మమ్మల్ని విడిచి ఎక్కడికి వెళ్ళిపోతావు? వెళ్లి ఆ అమ్మాయిని పెండ్లిచేసుకుని సుఖంగా వుండగలిగే ధైర్యం నీకుంటే నా కడుపులో కారుచిచ్చు వెలిగించి వెళ్ళిపో, బాబూ...” అంటూ ఏడుస్తుంది. అందుకు సుధ “అమ్మా! మీ మాటలకు వ్యతిరిక్తంగా చెయ్యగలిగేవాడినయితే వెంటనే వెళ్ళిపోయే ఆ పని

చేసేవాడిని. ఇంతవరకు నా తల్లి మాటలకు వ్యతిరేకంగా నేనేమీ చెయ్యలేదు. ఇప్పుడుచేసీ నేను సుఖించలేను. అందుకే ఎవ్వరికీ బాధ లేకుండా వుండడానికి నా త్రోవేదో నేను చూసుకుంటాను. అమ్మా!" అంటూ తల్లిని కౌగలించుకుంటాడు. తల్లి కూడా బావురుమంటుంది.

"బాజీ! నన్ను ఏటముంచి వెళ్ళిపోతావా? ఇంతవరకూ వచ్చావా సుధా! ఇంతవరకూ నా మాట కాదనలేదనే ఇప్పుడుకూడా మారతావనే నేనింత కాఠిన్యం వహించాను బాబూ! నీవు పోయాక నా జీవితం మాత్రం ఎందుకు? సుధా!" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ ఏడుస్తున్న సుధ కన్నీరు తుడుస్తుంది.

"నా కొడుకు బ్రతికివుంటే అదే చాలు. గర్భశోకం నేను భరించలేను. కులం ఏమయిపోయినా సరే. సుధా! నీ యిష్ట ప్రకారమే కానీయి నాయనా" అని కన్నకొడుకు కన్నీరు తుడుస్తుందా మాతృమూర్తి. మాతృమూర్తి హృదయమే అది. "అమ్మ" అనే పదంలోని మాధుర్యం ముల్లోకాల్లో ఎక్కడ వెదికినా మీకు కన్పిస్తుందా చెప్పండి? కన్నతల్లికి సహజంగా వుండేది కడుపుతీపి. తల్లీ కుమారుడూ ఒకటయ్యేసరికి తండ్రి కఠినహృదయం మారక తప్పిందికాదు. ముందు కోపంగావున్నా రాను రాను తండ్రికూడా చల్లారాడు. ఆనందంగా తిరిగి సుధ కాలేజికివస్తాడు. ఇందిర కందజేస్తాడానందంగా సంతోషవార్త. ఇద్దరూ తేలికైన హృదయాలతో పట్టుదలతో ఆ మిగిలిన రెండు నెలలూ చదివి బి. యస్. సి. పూర్తిచేశారు. ఆ సెలవుల్లో రెండు కుటుంబాలూ సంతోషంగా హృదయపూర్వకంగా వివాహాన్ని పూర్తిచేశాయి. ఇప్పుడు ఇందిర మధురగాయకుని హృదయాధిదేవత.

పెండ్లి అయ్యాక సుధాకర్ వాళ్ళ పరీక్షాఫలితాలొచ్చాయి. సుధకి ఫస్టుక్లాసు, ఇందిరకి సెకండు క్లాసు వస్తాయి. సుధ ఇందిరకి తెలియకుండా ఫారిన్ స్కాలర్‌షిప్‌కి అప్లై చేస్తాడు. కొద్ది రోజుల్లో అతని అదృష్టంకొద్దీ స్కాలర్‌షిప్ వస్తుంది. ముందు కొడుకుని విడిచిపెట్టివుండాలే అని తల్లిదండ్రులు ఒప్పుకోరు. కాని మళ్ళా కొడుకు పైకి వస్తాడే అని ఆశ యొకటి ప్రోత్సాహించడంవల్ల ఒప్పుకోక తప్పిందికాదు. ఇందిరనువిడిచి సుధ వుండలేడు కనుక ఆమెనూ తీసుకువెళ్ళాలనుకుంటాడు. కాని శర్మకామెను విడిచివుండాలంటే గుండెల్లో రాయిపడింది. ఒకరిచేతిలో పెట్టాక తను వేరే చెప్పడానికికూడా హక్కు లేదు కదా! అందుకతనెంతో మథనపడతాడు. కాని పైకి "వెళ్ళొద్దు" అని చెప్పలేకపోతాడు. ఒక వేళ చెప్పినా సుధాకర్ ఏమనుకుంటాడు? పెండ్లయిన తర్వాతకూడా అతనిమాట వినకపోతే ఇందిరని మాత్రం ప్రపంచం ఏమంటుంది? ఇటు అన్నని విడిచివుండలేదు. అటు సుధని విడిచివుండలేదు. "ఏవిధంగానైనా ఆడపిల్ల పరాయివాళ్ళపిల్లేకదా. అంత మీరు బెంగపెట్టుకుని ఇందిర సంసారాన్నేమి చెయ్యదలచుకున్నారని" సుందరెన్ని విధాలో శర్మకి నచ్చచెబుతుంది. శర్మ ఎంతో విచారిస్తాడు. చివరికి ఆవేదనను భరించలేక ఒక రోజు సుందరి దగ్గర చిన్నపిల్లాడిలా ఏడ్చేస్తాడుకూడాను. కాని సుందరి అతన్నెంతో ఓదారుస్తుంది. సుందరిలాంటి భార్య దొరకబట్టే శర్మజీవితమింతవరకు ఒడిదుడుకులు లేకుండా గడచిపోయింది. భగవదేచ్ఛయంతా చివరికి ఇందిరకు సుధతో వెళ్ళక తప్పిందికాదు. ఆమె యీ ప్రదేశం విడిచే రోజున చిన్న పిల్లల్లా అన్నాచెల్లెళ్ళిద్దరూ ఒకరినొకరు కౌగలించుకుని యేడ్చేస్తారు. అదే పవిత్రసోదర ప్రేమ. ఇందిర వెళ్ళాక మొదట కొన్ని రోజులు మరీ పిచ్చెత్తినట్లుండేది శర్మకి. కాని సుందరి శర్మయందెంతో శ్రద్ధ తీసుకుని ఒక్క నిముషమైనా అతన్ని ఒదిలివుంటే యేమేమి ఆలోచించి మనసు పాడుచేసుకుంటాడోనని అతన్ని కంటికి రెప్పగా కాపాడేది. ఇలా రోజులు గడు

స్తున్నాయి. భగవంతుడు ఈ దంపతులమీద చల్లని చూపు చూసినట్లున్నాడు. సుందరి గర్భం ధరించింది. శర్మ ఈ వార్త విన్నాక, సంతోషంగా వుంకళ్లుతున్నాడు సుందరి పొట్టలో పాపాయిని తలచుకుంటూ. ఎలాగయితేనేం తొమ్మిదినెలలూ దాటి పదవనెల జొరబడుతుంది. నెలలు పూర్తి అయ్యేసరికి సుందరికి పురుడువస్తుంది. కాని శర్మ అదృష్టరేఖ తిరిగిపోతుంది. పురుడు కష్టంకాగా శర్మని విచారంలో ముంచి సుందరి చనిపోయిన శిశువుని ప్రపంచానికి విడిచిపెట్టి ఆమెకింక యీ లోకంతో సంబంధంలేనట్లు పరలోకానికి పయనమవుతుంది. దానితో శర్మ పూర్తిగా కృంగిపోతాడు. జీవితంమీద విరక్తిపుడుతుంది. తనతో సమంగా రక్తం పంచుకుపుట్టిన ఇందిర ఆ విధంగా దూరమయింది తనకి. తన ప్రాణానికంటే మిన్నగా కాపాడిన అర్ధాంగి తనని అన్యాయంచేసి తన త్రోవ తను చూసుకుంది. ఏమిటీ అన్యాయం? ఒక్కొక్క జీవి ఈ విధంగా అంతులేని బాధలతో కుమిలి కృశించిపోవాలి కాబోలు! ఇవే భగవంతుని లీలలు. ఎప్పటికేమవుతుందో యెవరికీ అర్థంకాదు. ఇప్పుడు శర్మకీ యీ ప్రపంచానికీ యేమీ సంబంధంలేదు. కాషాయవస్త్రాలు ధరించి ఎప్పుడూ భగవంతుని నామమే స్మరించుకుంటూ పుణ్యక్షేత్రాలు తిరుగుతూంటాడు. భగవంతుడు తనకిన్ని కష్టాలు తెచ్చిపెట్టినా మళ్ళా ఆ భగవంతుడంటేనే అంత భక్తి ఎందుకో! అది మాయగానే వుంటుంది తలచుకొంటూంటే. అతని యీ ప్రయాణానికి గమ్యం ఏది? ఎంతదూరమని యిలా ప్రయాణం సాగిస్తాడు? ఈ ప్రపంచానికి ఒక అంతూ, దరీ అనేవి వుంటేగా! అంతా అయోమయము యిది!!

—o—

మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కుదుళ్లను పదిలము చేయునది

కేసరి గారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.